క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా భవాని ప్రసాద్



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా భవానీ ప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈయన పొదిలి, మదనపల్లిలో కమిషనర్‌గా విధులు నిర్వహించారు. మదనపల్లిలో విధులు నిర్వహించిన తరువాత డీఎంఏ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేశారు. మరో రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ అన్నారు. మండలంలోని కంచనపుత్తూరులో మహిళలకు బుధవారం ఆమె పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. తడిచెత్త, పొడిచెత్తను వేరు చేయాలని, గ్రామంలో ఎక్కడా చెత్త లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వచ్చేది వర్షాకాలం కావడంతో ప్రతిఒక్కరూ పారిశుధ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



గుర్తింపుకార్డులు అందుకున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని శ్రీకాళహస్తి ఎంఈఓ భువనేశ్వరి అన్నారు. మండలంలోని ఈశ్వరయ్య కాలనీ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, తొట్టంబేడు జెడ్పీ ఉన్నత పాఠశాల సహాయకులు మోహన్‌రావు తన సొంత నిధులు రూ.5వేలు వెచ్చించి గుర్తింపు కార్డులను అందజేశారు. హెచ్ఎంలు మోహన్‌బాబు, పోతురాజు, ఉపాధ్యాయులు లక్ష్మి, రాజారాణి, జ్యోతీదేవి, శిరీష, ఫౌండేషన్ సభ్యులు వెంకయ్యబాబు, మునిశేఖర్, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.3.48 లక్షలు

ఏర్పేడు: గుడిమల్లంలోని పురాతన శైవక్షేత్రం శ్రీఆనందవల్లీ దేవి సమేత పరశురామేశ్వరాలయ హుండీ ఆదాయం రూ.3,48,126 వచ్చినట్లు ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి తెలిపారు. జూన్ 18వ తేదీ నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు భక్తులు హుండీలో కానుకలుగా సమర్పించిన నగదును బుధవారం లెక్కించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉత్సవాలు పరిసమాప్తం



ధ్వజావరోహణం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: స్థానిక టీటీడీ అనుబంధ భద్రకాళీ సమేత వీరభద్రుని ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం సాయంత్రం ధ్వజావరోహణంతో పరిసమాప్తమయ్యాయి. అంతకుముందు స్వామి, అమ్మవారు పల్లకీ ఉత్సవంలో పురవీధుల్లో విహరించారు. సాయంత్రం భద్రకాళీ అమ్మవారితో వీరభద్రుడు పల్లకిని అధిరోహించి గ్రామ వీధుల్లో విహరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం 7 గంటలకు ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను టీటీడీ స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ పర్యవేక్షించారు.

అర్హత ఉంటే పథకం అందించాలి



రైతులకు చెక్కును ఇస్తున్న ఆదిమూలం

నారాయణవనం: పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత అధికారులదే అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మండలంలో పీఎం కిసాన్, అన్నదాత పథకాల కింద 2,642 మంది రైతులకు మంజూరైన రూ.1,84,87,000 మెగా చెక్కును ఆయన రైతులకు అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సుమన్‌కుమార్, ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ రోజారాణి, ఇన్‌చార్జ్ ఏఓ విజయకుమార్, రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయశాఖ క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈగా హేమకుమార్

బుచ్చినాయుడుకండ్రిగ: మండల ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈగా హేమకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఈగా పనిచేస్తున్న గోపి బదిలీపై వరదయ్యపాళెం మండలానికి వెళ్లారు. దీంతో తలారివెట్టు గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న హేమకుమార్‌ని నియమించారు.

ఖైదీల పర్యవేక్షణ డొల్ల

- సత్యవేడు సబ్ జైలులో తరచూ రిమాండ్ ఖైదీల పరారీ
- బ్రిటీష్ కాలం నాటి భవనాల్లో సబ్ జైలు నిర్వహణ
- తక్కువ ఎత్తులో జైలు గోడలు
- నామమాత్రంగా పర్యవేక్షణ



సత్యవేడులోని సబ్‌జైలు

వరదయ్యపాళెం: నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులోని సబ్‌జైలులో ఖైదీల పర్యవేక్షణ నామమాత్రంగా మారుతోంది. అందుకు నిదర్శనమే రెండు రోజుల క్రితం జైలులో ఉన్న రిమాండ్ ఖైదీ శ్రీనివాస్ జైలు గోడలు దూకి పరారైన సంఘటన. ఈ పరిస్థితి గతంలోనూ పలుమార్లు జైలు నుంచి రిమాండ్ ఖైదీలు పరారైన ఘటనలు అనేకం ఉన్నాయి. అయితే అక్కడ ఖైదీల పర్యవేక్షణ విధులు నిర్వహించే జైలు సిబ్బంది వ్యవహారశైలి కూడా తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఎత్తైన గోడలు దాటి ఖైదీ పరారవుతున్నా పర్యవేక్షించాల్సిన అధికారులు మొద్దునిద్రలో ఉండడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. తాజా ఘటనతోపాటు గతంలోనూ మూడుసార్లు ఖైదీలు జైలు నుంచి పరారైనట్లు సమాచారం. ఈ తప్పిదానికి గతంలో విధులు నిర్వహిస్తున్న సబ్ జైలర్‌తోపాటు ఇద్దరు సిబ్బంది కూడా సస్పెన్షన్‌కు గురయ్యారు. అయితే ఇన్ని ఘటనలు జరుగుతున్నా జైలు సిబ్బంది విధుల నిర్వహణ తీరులో మార్పు రాకపోవడం గమనార్హం. ఈ ఘటనపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బ్రిటీష్ కాలం నాటి భవనంలో జైలు నిర్వహణ

సత్యవేడులో అభివృద్ధి శూన్యం అనడానికి ప్రధాన కార్యాలయాలు నేటికీ బ్రిటీష్ కాలం నాటి భవనాల్లో కొనసాగడమే. ఆ దశగా సత్యవేడు సబ్‌జైలు సైతం బ్రిటీష్ కాలం నాటి భవనంలో కొనసాగుతోంది. ఈ జైలు భవనానికి చుట్టూ భద్రతగా ఉండాల్సిన గోడ సైతం 8 అడుగుల ఎత్తులోనే ఉండడం గమనార్హం. దీనికి తోడు జైలు భవనం కూడా పూర్తిగా శిథిల దశకు చేరుకుంది. వర్షం కురిస్తే ఉరవడంతో పాటు వసతులు కూడా నామమాత్రమే. దీన్ని ఆసరాగా తీసుకుంటున్న రిమాండ్ ఖైదీలు తరచూ జైలు నుంచి పరారయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

నామమాత్రపు పర్యవేక్షణ

ప్రధానంగా జైలర్ ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షణ చేపట్టాలి. అయితే వారు నామమాత్రపు పర్యవేక్షణ చేపట్టడంతో దాన్ని ఆసరాగా తీసుకుంటున్న రిమాండ్ ఖైదీలకు సకల సౌకర్యాలతోపాటు ఇష్టారాజ్యంగా వ్యవహరించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు సమాచారం. అందుకు జైలు సిబ్బందికి ఖైదీల కుటుంబసభ్యులు ములాఖత్ సమయంలో సిబ్బందికి చేయి తడపాల్సిందే. సిబ్బంది అడిగింది ఇస్తే అన్నీ చేసుకోవచ్చన్న చందాన అక్కడ సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితులపై ఏకంగా రిమాండ్ ఖైదీలు పరారవుతున్నట్లు సమాచారం.

వేటు పడేనా?

తాజాగా రిమాండ్ ఖైదీ శ్రీనివాస్ సత్యవేడు సబ్ జైలు నుంచి తప్పించుకు వెళ్లిన ఘటనపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించేనా? ఒకవేళ స్పందిస్తే ఎవరిని బాధ్యులు చేస్తారో అనే టెన్షన్‌లో జైలు సిబ్బంది ఉన్నారు. ఎవరిపై వేటు పడుతుందో అన్న పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఏదిఏమైనప్పటికీ జైలు సిబ్బంది పనితీరులో ఇప్పటికైనా మార్పు వస్తుందో లేదో అనే ఆలోచనలో స్థానికులు చర్చించుకుంటున్నారు.

మురుగు తొలగింపు



మురుగుకాలువల్లో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న కార్యదర్శి చిరంజీవి, ఉప సర్పంచ్ మునిరాజా

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ గ్రామ పంచాయతీలోని తంగెళ్లపురం గిరిజన కాలనీలో వీధుల్లో మురుగునీటి బుధవారం గ్రామ కార్యదర్శి చిరంజీవి, ఉపసర్పంచ్ మునిరాజా పారిశుధ్య కార్మికులతో తొలగించారు. సోమవారం సాక్షి దినపత్రికలో 'తంగెళ్లపురం..పడకేసిన పారిశుద్ధ్యం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై గ్రామ కార్యదర్శి స్పందించారు. మురుగు కాలువలలోని చెత్తాచెదారాన్ని తొలగించారు. తాగునీటి కొళాయిలకు ట్యాప్‌లను బిగించారు. పేడ దిబ్బలను తొలగిస్తామని, ఇళ్లలోని మురుగు నీటిని వీధులలోకి వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చదువుకు పేదరికం అడ్డు కాకూడదు



విద్యాసామగ్రిని అందిస్తున్న అమరావతి

కేవీబీపురం: విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుల్లో రాణిస్తే మరికొందరికి సాయం చేయవచ్చని పిళ్లారి ఫౌండేషన్ అధినేత పిళ్లారి అమరావతి తెలిపారు. బుధవారం మండలంలోని పెరిందేశం ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో చదువుతున్న 92 మంది పేద విద్యార్థులకు పిళ్లారి ఫౌండేషన్ ద్వారా బుధవారం నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు, పెన్సిళ్లు, జామెట్రీ బాక్స్‌లు వంటి విద్యాసామగ్రిని వితరణ చేశారు. తలారి మణి, తలారి అయ్యప్ప, వెట్టి గోవిందయ్య, తలారి నాగరాజు, అజిత్, నగరం మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ తప్పనిసరి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రవి

సత్యవేడు: విద్యార్థులకు ఉన్నత శిఖరాలకు చేరేందుకు క్రమశిక్షణ సంకల్పం తప్పనిసరిగా ఉండాలని గవర్నమెంట్ జూనియర్ కళాశాలల లెక్చరర్ల సంఘం స్టేట్ జనరల్ సెక్రటరీ రవి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరామిరెడ్డి అధ్యక్షతన ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. సమావేశంలో జెల్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. క్రికెట్, మ్యూజికల్ చైర్, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. లెక్చరర్లు అనిల్‌కుమార్, పి.రాజేష్‌కుమార్, శివరాం, సురేష్, సలీం, దస్తగిరి, సుబ్రమణ్యం, గీత, కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ తెరవాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

శ్రీకాళహస్తి: మండలంలోని వేడం గ్రామంలోని పెద్దమిట్టకండ్రిగ ప్రాథమిక పాఠశాలను మూసివేయడంపై గ్రామస్తులు ఆందోళన చేశారు. 20 మందికి పైగా విద్యార్థులు పెద్దమిట్టకండ్రిగ పాఠశాలకు వెళ్తున్నారు. పాఠశాలను మూసివేయడం వలన తమ పిల్లలను దూర ప్రాంతాలకు పంపించాల్సి వస్తోందని, ఇది తమకు కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఎంఈఓ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. తిరిగి పాఠశాలను తెరవాలని ఎంఈఓ భువనేశ్వరికి వినతిపత్రం అందజేశారు.

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద ప్రేమ్‌సింగ్ తమాంగ్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. అందులో సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్‌సింగ్ తమాంగ్, కర్ణాటక హోంమంత్రి గంగాధరయ్య పరమేశ్వర, ఎమ్మెల్సీ రామోజీ గౌడ కుటుంబ సమేతంగా దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఈఓ బాపిరెడ్డి, వేదపండితులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కర్ణాటక హోం మంత్రికి వైఎస్సార్‌సీపీ నేతలు అంజూరు తారక శ్రీనివాసులు, వయ్యాల కృష్ణారెడ్డి, శ్రీవారిసురేష్, షేక్ సిరాజ్‌బాషా, సాధన మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్ తదితరులు స్వాగతం పలికారు.

పింక్ బస్ సేవలను సద్వినియోగం చేసుకోండి



స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యబృందం

కేవీబీపురం: గ్రామీణ ప్రజలు పింక్‌బస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలను పొంది, క్యాన్సర్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాస్ రాష్ట్రీయ సేవా సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం అన్నారు. ఈ మేరకు అంజూరు గ్రామంలో రాస్, టాటా సంయుక్త సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ స్క్రీనింగ్ ద్వారా బుధవారం సుమారు 170 మందికి ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకయ్యబాబు బృందం, హేమంత్ కుమార్ రెడ్డి, రెడ్డికుమారి, మెహతాజ్, మహేంద్ర, సర్పంచ్ శ్రీజయ, సెక్రటరీ నాగమణి పాల్గొన్నారు.

ఎస్‌టీఎఫ్ఐ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

రేణిగుంట: కోల్‌కత్తాలో ఈనెల 8, 9,10 తేదీల్లో జరిగే ఆలిండియా ఉపాధ్యాయ సంఘం స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రజతోత్సవ మహాసభలను పురస్కరించుకుని రేణిగుంట రైల్వే స్టేషన్ ఎదుట బుధవారం ఎస్‌టీఎఫ్ఐ జెండాను స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ మెంబర్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, రాష్ట్ర కార్యదర్శులు యస్.యస్.నాయుడు, జి.వి.రమణ ఆవిష్కరించారు. అనంతరం రైల్లో కోల్‌కత్తాకు పయనమయ్యారు. నేతలు పాలెం మహేష్‌బాబు, మదన్, విజయకుమార్, ముత్యాలరెడ్డి, షేక్ జాబీర్, మణి గండన్, లింగమయ్య, నిర్మల, దీనావతి, ఆదినారాయణ, వంశీకృష్ణ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

తొట్టంబేడు: తొట్టంబేడు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా కె.బలరామ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రత పరిరక్షణకు కృషిచేస్తానని తెలిపారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న రామాంజనేయులను వీఆర్‌కు పంపిన విషయం విదితమే.

శ్రీసిటీ ఎస్ఐగా అరుణ్‌కుమార్ రెడ్డి

వరదయ్యపాళెం: శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా అరుణ్‌కుమార్ రెడ్డిని నియమిస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేణిగుంట పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలు ఉన్న శ్రీసిటీ ప్రాంతంలో వేలాదిమంది ఉద్యోగులు పని చేస్తున్నారని, వారి భద్రతకు ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

శ్రీకాళహస్తి: ఎస్వీ యూనివర్సిటీ సోమవారం విడుదల చేసిన మొదటి సెమిస్టర్ పరీక్షల్లో పట్టణానికి చెందిన ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ర్యాంకుల ప్రభంజనం సృష్టించారు. బీఎస్సీ(హానర్స్)లో లహరి 8.8, పి.శిరీష 8.3, రమ్య 8.08, బీఎస్సీ(బయోటెక్నాలజీ)లో చంద్రిక 7.55, సుజాత 7.55, అంజలి కుమారి 6.58, వాణిప్రియ 6.35 పాయింట్లతో యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఇక బీకాం (సీఏ)లో షేక్ మస్రత్ 9.30, ప్రత్యూష 9.25, మేఘన 8.65 పాయింట్లతో పట్టణ యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వారిని బుధవారం కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి అభినందించారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో వినాయకుడి ప్రతిమలు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు, పీఎస్ఐ సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం వారు స్థానిక పోలీసుస్టేషన్‌లో మండలంలోని గ్రామాల్లో వినాయక ప్రతిమల ఏర్పాటుపై ప్రభుత్వ నిబంధనల గురించి ముందస్తు హెచ్చరిక చేశారు. సీఐ తిమ్మయ్య మాట్లాడుతూ నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి: ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. శ్రీకాళహస్తి ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వినాయక చవితి ఉత్సవాలపై విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయకచవితి వేడుకలను ఆయా మండపాల కమిటీ నిర్వాహకులు నిబంధనల ప్రకారం నిర్వహించుకోవాలన్నారు. వినాయక ప్రతిమలను కొలువుదీర్చే నిర్వాహకులు అనుమతి తీసుకోవాలన్నారు. సీఐ గోపి పాల్గొన్నారు.

కమనీయం.. ద్రౌపదీ కల్యాణం



విశేష అలంకరణలో అమ్మవారు

ఏర్పేడు: పాపానాయుడుపేటలో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి 155వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ముందుగా అమ్మవారి జన్మస్థలమైన చెన్నంపల్లిలో అమ్మవారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి పూలు, ఫలాలు తెచ్చి ఊరేగింపుగా పాపానాయుడుపేట ధర్మరాజస్వామి ఆలయానికి అమ్మవారిని మేళతాళాల మధ్య తీసుకొచ్చి గ్రామపెద్దలు సారె సమర్పించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూమికి ఆరోగ్యం



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు

బుచ్చినాయుడుకండ్రిగ: పచ్చిరొట్ట ఎరువుల వాడకంతో భూమి ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా, నేల నీటిని నిలుపుకునే సామర్థ్యాన్ని కూడా పెంచుతుందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు అన్నారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగలోని రైతు సేవా కేంద్రంలో పీఎంఆర్ కేవీవై పథకంలో భాగంగా జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వారిచే రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి షణ్ముగం, ఏఈఓ లావణ్య, రవిప్రసాద్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

ఏర్పేడు: మండలంలోని రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ ఏర్పేడు మండలానికి 144 క్వింటాలు వచ్చాయని, కావాల్సిన రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పొందవచ్చని ఏఓ సాగరిక తెలిపారు. 10 కిలోల బ్యాగు రూ. 612లకు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేస్తారన్నారు. వీటితో పాటు నవధాన్యాల కిట్ 10 కిలోల బ్యాగు రూ.650 చొప్పున పంపిణీ చేస్తారన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

రేణిగుంట: యువత సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని రేణిగుంట రూరల్ సీఐ మంజునాథరెడ్డి తెలిపారు. మండలంలోని జి.పాళ్యం సమీపంలోని ఇండియన్ కలనరీ ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం రూరల్ సీఐ మంజునాథరెడ్డి విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు.

బహిరంగ ప్రదేశాలు శుభ్రం

మందుబాబులు మద్యం తాగే బహిరంగ ప్రదేశాలను గుర్తించామని, అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని అర్బన్ సీఐ జయచంద్ర తెలిపారు. సీఆర్ఎస్ సమీపంలో బుధవారం బహిరంగంగా మద్యం తాగే ప్రాంతాలను గుర్తించి స్థానికులు, పంచాయతీ సిబ్బంది సహకారంతో పోలీసులు శుభ్రం చేయించారు. ఎస్ఐ స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

రమేష్‌యాదవ్‌పై దాడి హేయం

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఆర్ రమేష్ యాదవ్‌పై టీడీపీ గూండాలు దాడి చేయడం గర్హనీయమని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ బాషా బుధవారం అన్నారు. ఆయన మాట్లాడుతూ ఇది రమేష్ యాదవ్‌పై జరిగిన దాడి కాదని, రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలపై జరిగిన దాడిగా పరిగణించాలన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని తెలుగుదేశం పార్టీ నాయకుల డైరెక్షన్‌లో రాజ్యం నడుస్తుందని విమర్శించారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అరాచక పద్ధతిలో గెలుపొందాలని చూస్తున్నారన్నారు. డబ్బు మద్యం విచ్చలవిడిగా పంపిణీ చేస్తున్నారని చెప్పారు. రమేష్‌యాదవ్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని షేక్ సిరాజ్‌బాషా డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ రమేష్‌పై దాడి అప్రజాస్వామికం

వరదయ్యపాళెం: పులివెందులలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గూండాల దాడి అప్రజాస్వామికమని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు దేవేళ్ల మహేంద్ర తెలిపారు. ఆయన బుధవారం వరదయ్యపాళెంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో మాట్లాడారు. టీడీపీ ఒక బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ఎమ్మెల్సీ పదవిలో ఉంటే తట్టుకోలేని టీడీపీ నేతలు క్రూరత్వంగా దాడి చేయడం యావత్ బీసీ జాతిని అవమానించిందన్నారు. దాడికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

రైతుకు ఊరట

శ్రీకాళహస్తి: మండలంలోని రాచగున్నేరికి చెందిన ఓ రైతుకు హైకోర్టు నుంచి ఊరట లభించింది. వివరాలు ఇలా ఉన్నాయి. సర్వే నంబర్ 296/2బీలో చెరువు భూమి అని కట్టడాలు తొలగించాలని శ్రీకాళహస్తి తహసీల్దార్ నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ రైతు హైకోర్టును ఆశ్రయించాడు. ఇరువరి వాదనలు విన్న తరువాత భూమికి సంబంధించిన పరిశీలన జరిగే వరకు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టొద్దని హైకోర్టు ఆదేశించింది. కలెక్టర్ నుంచి తుది ఉత్తర్వులు వచ్చే వరకు ఎలాంటి చర్యలు వద్దని ఆదేశించింది.

డ్వాక్రా మహిళలకు పాడి రుణాలు



శిక్షణలో డ్వాక్రా మహిళలు

ఏర్పేడు: డ్వాక్రా మహిళలకు పాడి రుణాలను విరివిగా అందిస్తున్నామని శ్రీజ పాలశీతలీకరణ ఏరియా మేనేజర్ విశ్వనాథం అన్నారు. ఏర్పేడులోని మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం శ్రీజ వీసీజీ, ఎంఆర్జి మహిళా సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాల సేకరణలో శ్రీజ భారతదేశంలో రెండవ స్థానంలో ఉందన్నారు. వీసీజీ (గ్రామ స్థాయి) సభ్యుల విధులు, బాధ్యతలను వివరించారు. డ్వాక్రా సంఘాల ద్వారా ఆవులు కొనుగోలుకు రుణ సహాయం అందిస్తుందన్నారు. ఏరియా పీఐబీ అధికారి నాగభూషణ్ యాదవ్, చెంచు మోహన్, శ్రీజ డెయిరీ ఏపీఎం సరిత, ఏరియా సూపర్‌వైజర్ సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

చంద్రప్రభపై నీలకంఠేశ్వరుడు



గ్రామవీధుల్లో ఊరేగుతున్న నీలకంఠేశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులోని అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి బుధవారం చంద్రప్రభ వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రజాప్రతినిధులుగా గుర్తింపు ఏదీ?

- అధికారులను ప్రశ్నించిన ప్రజాప్రతినిధులు
- 18వ తేదీకి సమావేశం వాయిదా



అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

రేణిగుంట: కూటమి ప్రభుత్వంలో ఏ ప్రభుత్వ కార్యక్రమం జరిగినా స్థానిక ప్రజాప్రతినిధులకు కనీస సమాచార ఇవ్వడం లేదని మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చ చొక్కా వేసుకున్న వారికే ప్రాధాన్యత ఇస్తున్నారు గాని ప్రజాప్రతినిధులుగా ఉన్న తమను పట్టించుకోకపోవడం ఏమిటని అధికారులను నిలదీశారు. సర్వసభ్య సమావేశానికి తహసీల్దార్ రాకపోవడంపై సమావేశాన్ని వాయిదా వేయాలని పట్టుబట్టారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభురావు ఈనెల 18వ తేదీకి సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రేణిగుంట మండల సర్వసభ సమావేశాన్ని బుధవారం ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించేందుకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభురావు సిద్ధమయ్యారు. 11.30 గంటలైన సమావేశానికి తహసీల్దార్ రాకపోవడంతో సభ్యులందరూ రెవెన్యూ అధికారి వచ్చేంతవరకు సమావేశం నిర్వహించేందుకు అంగీకరించలేదు. కొంత సమయానికి డిప్యూటీ తహసీల్దార్ దిలీప్ సమావేశానికి చేరుకోగా తహసీల్దార్ రావాలని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇన్‌చార్జ్ ఎంపీడీఓను సభ్యులు ప్రశ్నించారు. ఇంచార్జ్ ఎంపీడీఓ, ఎంపీపీ పలుమార్లు సభ్యులకు చెప్పినా వాయిదాకు పట్టుబట్టడంతో ఈనెల 18వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఏఓ పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.